క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి, చైర్మన్‌ను సత్కరిస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు తెలంగాణ హస్తకళా కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యంను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఘనంగా సత్కరించారు.

గ్రాట్యూటీ ఇప్పించాలని వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వేజ్‌బోర్డ్ ప్రకారం 2017లో పెరిగిన గ్రాట్యుటీ ఇప్పించాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరారు. ఈ సందర్భంగా వారు సీఎండీ బలరామ్‌కు బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రకరకాల కారణాలతో గ్రాట్యుటీ చెల్లింపు వాయిదా వేస్తున్నారని, ఇకనైనా స్పందించాలని కోరగా సీఎండీ సానుకూలంగా స్పందించారు. చింతల చెర్వు గోర్షెం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని కోల్ టెస్టింగ్ ల్యాబ్ సమీపాన నిర్మిస్తున్న ఏరియా వర్క్‌షాపు వద్ద బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా కనక దుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ ఉపేందర్‌బాబు, డీజీఎం శ్రీకాంత్ మాట్లాడుతూ... సంస్థలో ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా తొలుత అమ్మవారిని ఏర్పాటు చేసుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు ఎండీ.రజాక్, ఉపేందర్, సత్తార్‌పాషా, మధుకృష్ణ, అశోక్, రాంచందర్‌రావు వై.ఈశ్వరరావు, జి.దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పాల్వంచ: ఈనెల 11, 12,13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని కళాభారతీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాట్య రవళి నృత్య పోటీల్లో పాల్వంచకు చెందిన శ్రీ సంతోషిణి నాట్య నిలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరిని బుధవారం నాట్యాచారిణి రమాదేవిరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఆయిల్ బాల్స్ విడుదల

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని పలు ఏరియాల్లో నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల లార్వాలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని అయ్యప్పనగర్, ఒడ్డుగూడెం ఏరియాల్లో ఖాళీ ప్లాట్లలో, పలుచోట్ల నీళ్లు అధికంగా నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా ఆయిల్స్ బాల్స్‌ను విడుదల చేశారు.

కల్తీ మద్యంపై దృష్టి సారించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు వైన్‌షాపులు, బెల్ట్‌షాపులలో మద్యం కల్తీ జరగకుండా తనిఖీ చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా, లైసెన్సులు లేకుండా ఉన్న బెల్ట్ షాపులలో అమ్మే మద్యం ఎవరు తయారు చేశారు..? కల్తీ ఉందా.. లేదా..? మద్యం షాపులు బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తుందా లేదా అని తనిఖీ చేయాలన్నారు. దీంతోపాటు తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టి చెడుమార్గాలకు దారి తీసే వైపు ప్రయాణం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు.

వేతనాల విడుదలపై హర్షం

టేకులపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలు సుమారు రూ.150 కోట్లు విడుదల చేయటం హర్షణీయమని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్, ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు మూడు బిచ్చు అన్నారు. బుధవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాపితంగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ వర్కర్స్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన ఫలితంగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్మికవర్గం సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కత్తుల ఎర్రయ్య, షికారు మల్లయ్య, భూక్యా కమిలి, కోరం పాండు, చీమల సూర్యనారాయణ, భూక్యా లింగా పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో మొహర్రం



కొత్తగూడెంటౌన్: రామవరం శ్రీఇంక్లైన్‌లోని వెంగళరావు కాలనీలో పీరీల ఊరేగింపు

పాల్వంచ: మహోన్నత త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాత్రి కరకవాగు గ్రామంలో పీర్ల చావడి వద్ద మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్వాల హాజరయ్యారు. మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా హిందువులు, ముస్లింలు మొహర్రంను నిర్వహించి సోదర భావాన్ని చాటుతారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ముస్లిం పెద్దలు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాల చిహ్నంగా జరుపుకునే రోజు మొహర్రం అన్నారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, బానోతు హుస్సేన్, జాటోతు బాలాజీ నాయక్, అజ్మీరా రవి, అజ్మీర ప్రశాంత్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జమా మసిద్‌లో అహ్లె సున్నత్ వాల్ జమాత్(ఏఎస్‌జే) వారి ఆధ్వర్యంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు పానకం పంపిణీ చేశారు. షేక్ కరీంఖాద్రి మాట్లాడుతూ... న్యాయం, ధర్మం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కబ్బాలా మైదానంలో జరిగిన పవిత్ర యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమాం హుస్సేన్ నాయకత్వంలో 72 మంది సైన్యంతో కలిసి వీరోచిత పోరాటం చేసి ప్రాణ త్యాగం చేసి వీర మరణం పొందిన పదో రోజును మొహర్రంగా జరుపుకుంటున్నామని తెలిపారు. వారి త్యాగాలను స్మరిస్తూ వారి పోరాట స్ఫూర్తితో వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. హుస్సేన్‌ఖాన్, గౌస్ మెయిద్దీన్, యాకూబ్‌ఖాద్రి, అఖ్తర్‌ఖాన్, అస్లాం, షేక్ నయీమ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ముస్లింలు మొహర్రం పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాపకొల్లు గ్రామంలో పీర్ల ఉత్సవాలను పది రోజులుగా వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పీర్ల సావిడీలోని పీర్లు అగ్ని గుండంలో నడిచాయి. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో మొహర్రం సందర్భంగా అమరులను స్మరించుకుంటూ భక్తులకు బెల్లం షరబత్, పాల షరబత్‌లను స్థానిక ముస్లింలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్తఫా, ఫకృద్దీన్, తాజ్, రాకేష్, ఇమ్రాన్, జైబర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మొహర్రం వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మూడుతండా, బోడు, మద్రాస్‌తండా తదితర గ్రామాల్లో పీరీలకు పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం పీరీలతో భారీగా ఊరేగింపు నిర్వహించి, వాగులో నిమజ్జనం చేశారు.



పాల్వంచ: వేడుకలో పాల్గొన్న కొత్వాల



జూలూరుపాడు: పాపకొల్లులో...



టేకులపల్లి: నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

పేదలకు అందని ప్రభుత్వ వైద్యం



మాట్లాడుతున్న శంకర్

ఇల్లెందు: ప్రభుత్వ వైద్యశాలలో పేదలకు కనీస వైద్యం అందటం లేదు. ఇల్లెందు వైద్యశాలలో కనీస సదుపాయాలు కూడా లేవు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించటంతో పాలకులు, అధికారులు విఫలం అవుతున్నారని సీపీఐ జిల్లా నాయకుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఇల్లెందు సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 30 పడకల ఆస్పత్రి నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారి 100 పడకల ఆస్పత్రిగా మారినప్పటికీ సదుపాయాలు కల్పించలేదన్నారు. కీలకమైన విభాగాలకు డాక్టర్లు, శిక్షణ పొందిన సిబ్బంది నియామకం చేయలేదన్నారు. హోమియో వైద్యం కూడా అందటం లేదు. అంబులెన్స్ సదుపాయం లేదు. తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, పేదలకు వైద్యం అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో గడదాసు నాగేశ్వరరావు, ఉడుత ఐలయ్య, కొమరయ్య, యాదగిరి, పోచయ్య, అఫ్జల్, ఈర్ల రవి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు స్థలం కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం రైల్వేస్టేషన్ పక్కన వీధిలో రోడ్డు విస్తరణకు రైల్వే స్థలం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని 20వ వార్డులో ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ... రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ద్వారా రోడ్డు విస్తరణకు రైల్వే స్థలం కేటాయింపుపై ప్రజాభిప్రాయాన్ని కేంద్రానికి, కేంద్ర రైల్వే మంత్రికి తెలిజేసేలా సంతకాల సేకరణ కొనసాగుతుందన్నారు. రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రాపురం గ్రామ పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోలేదన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.రాంబాబు, దేవీప్రసన్న, బాలిశెట్టి సత్యభామ, వై.శ్రీనివాస్‌రెడ్డి, తలుగు అనిల్, భూక్యా రుక్మిణీ, ఎస్‌కే మసూద్, సుందర్‌రాజ్, రమణ, సుందర్ లాల్‌కోరి, బాలపాసి, పల్లపు వెంకటేశ్వర్లు, కనకం సూరిబాబు, వాణిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి..



పాతర్లగడ్డలో ధర్నా చేస్తున్న స్థానికులు

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రం నుంచి బోడు, కొప్పురాయి, రామకృష్ణాపురం తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం పాతర్లగడ్డ ప్రధాన రహదారిపై స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ నాయకుడు ఎట్టి నర్సింహారావు మాట్లాడుతూ... నిత్యం ప్రజలు వివిధ ఏజెన్సీ గ్రామాల నుంచి మండల కేంద్రమైన టేకులపల్లికి వచ్చిపోతుంటారని, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. అత్యవసర సమయంలో వాహనాలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రైవేటు వాహనాల వల్ల కాలయాపన జరిగి సమయానికి పనులు పూర్తి చేసుకోలేకపోతున్నామని, ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయారు. ఆర్టీసీ సంస్థ స్పందించి వెంటనే ఈ ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, బండ పాపమ్మ, బోడ శిరోమణి, షేక్ హలీమా, మాడే స్వరూప, బండ సమ్మక్క, బండ రాధ పాల్గొన్నారు.

గని ప్రమాద మృతులకు నివాళి

ఇల్లెందు: స్టట్ ఇంక్లైన్ గనిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు మొహర్రం పండుగ సందర్భంగా నివాళులర్పించారు. బుధవారం 24 ఏరియాలోని స్టట్ ఇంక్లైన్ గని మృతుల స్మారకార్థం నిర్మించిన సమాధుల వద్ద సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎం మాట్లాడుతూ.. 1938లో జరిగిన ప్రమాదంలో 43 మంది మృతి చెందినట్లు తెలిపారు. దీంతో భూగర్భ గనులలో పని చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని పాసీ కులస్తులను తీసుకొచ్చి బొగ్గు వెలికి తీసినట్లు చెప్పారు. ప్రతీ ఏటా మొహర్రం నాడు గనిప్రదేశంలో సంస్మరణ సభ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించటం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(ఐడీ) గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం(సివిల్) రవికుమార్, ఇతర అధికారులు ధనుంజయ్‌రెడ్డి, అంజిరెడ్డి, శివకుమార్, గుర్తింపు సంఘం బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం తరుపున మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబారిన నల్ల నేల...

43 మంది అధికారులు, ఉద్యోగులు, కార్మికుల మృతితో సింగరేణి నల్ల నేల ఎర్రబారిందని బీఆర్‌ఎస్ నేత దిండిగల రాజేందర్ అన్నారు. స్టట్ ఇంక్లైన్ గని ప్రమాద మృతులకు నివాళులకు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహ్మద్ జాఫర్ హుస్సేన్, ఎస్.సత్యనారాయణ, కిష్టయ్య, లాల్‌సింగ్, పరుచూరి వెంకటేశ్వరరావు, జబ్బార్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం తీరుతో మున్సిపల్ ఆదాయానికి గండి

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టేలా పాలకవర్గం తీరు ఉందని.. ఈ నేపథ్యాన ఇటీవల జరిగిన సంత వేలంపాటను రద్దు చేయాలని సీపీఎం నాయకుడు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారాంతపు సంత టెండర్‌ను ఏకపక్షంగా నిర్వహించారని ఆరోపించారు. ఎక్కడా ప్రచారం చేయకుండా టెండర్ నిర్వహించారని, ఫలితంగా గతంతో పోలిస్తే అతితక్కువ ఆదాయం వచ్చిందన్నారు. ఇకనైనా మున్సిపాలిటీలో అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భుక్యా రమేష్, డి.వీరన్న, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నండిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఇల్లెందు: విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకునే మత్తు, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ బత్తుల సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇల్లెందులోని మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు మత్తుకు బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు.

అంతేగాక అత్యాశకు వెళ్లి సైబర్ నేరాలకు బలవుతున్నారని వివరించారు. మొబైల్‌లో వచ్చే లింకులను రిసీవ్ చేసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ నాగేశ్వరరావు, ఏఎస్ఐ రవికుమార్, కాలేజ్ ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, అధ్యాపకులు సంధ్య, హరీష్, పీడీ నజీముద్దీన్ పాల్గొన్నారు.

‘సీతారామ’ జలాలు తొలుత జిల్లాకే ఇవ్వాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: ఏజెన్సీ జిల్లా భూములను ఎండబెట్టి మైదాన ప్రాంతానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకెళ్లాలని యోచన విరమించుకోవాలని, తొలుత రోళ్లపాడు రిజర్వాయర్‌ను పూర్తిచేసి మొదటి ప్రాధాన్యతగా జిల్లా భూములకే నీరు ఇవ్వాని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జడ సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బద్దుతండాలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మించే ప్రాజెక్ట్ ద్వారా మైదాన ప్రాంతానికి నీరు తరలించడం జల దోపిడీకి నిదర్శనమన్నారు. ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ మండలాలకు నీరు ఇచ్చాక ఎక్కడకు తీసుకెళ్లినా ఇవ్వాలని అభ్యంతరం లేదని తెలిపారు. ఈ మేరకు రోళ్లపాడు రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తిచేసి, బయ్యారం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూక్యా నర్సింగ్, భూక్యా కీర్యా, రఘు, బాల, బద్యా, హుస్సేన్, వాల్యి, ప్రసాద్, శంకర్, వెంకట్, సుక్కు, మణి, కాటేశ్వరి, కాంతి, మారోని, లలిత, శౌరి తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని తుమ్మలచిలక గ్రామంలో జరిగిన సమావేశంలో న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాత డిజైన్ ప్రకారం సీతారామ ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు డి.ప్రసాద్, నాగరాజు, వెంకన్న, శ్రీకాంత్, సురేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తక్షణం వైద్యం అందించండి



మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఇల్లెందురూరల్: జ్వరాల బారిన పడిన ప్రజలకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో జ్వరపీడితులను బుధవారం ఆయన పరామర్శించారు. జ్వరాల తీవ్రతపై పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చడంతోపాటు జ్వరాలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. గ్రామాలలో ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, కాంతారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ స్క్రాప్ తరలింపుపై విచారించాలి



మాట్లాడుతున్న కామేష్

పాల్వంచ: కేటీపీఎస్ పాత ప్లాంట్ స్క్రాప్ తరలింపులో జరిగిన అవినీతిపై నిపుణులతో విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీపీఎస్ పాత ప్లాంట్ స్క్రాప్ టెండర్లు, తరలింపులో అనేక అవకతవకలు ఉన్నాయని మొట్టమొదట స్పందించింది బీఎస్పీనే అన్నారు. 80 శాతం తరలించిన తర్వాత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

రెండుసార్లు కర్మాగారాన్ని సందర్శించి ఏం సాధించారన్నారు. కనీసం తరలింపును కూడా నిలుపుదల చేయలేకపోయారని విమర్శించారు. కూలింగ్ టవర్ అనుమతుల్లో గత కలెక్టర్ నిబంధనలు పాటించలేదని, పాత తేదీతో అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. కలెక్టర్ విచారణ ఎంత వరకు వచ్చిందో చెప్పాలన్నారు. ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపి అవకతవకల నిగ్గు తేల్చాలన్నారు. సమావేశంలో కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కాటబోయిన వసుంధర, సరోజ, వరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు రుణమాఫీ సంబురాలు

ఇల్లెందురూరల్: శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధినాయత్వం ఇచ్చిన హామీ మేరకు గురువారం మొదటి విడతగా రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోందని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు పులి సైదులు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా గురువారం మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో మధ్యాహ్నం 3గంటలకు సంబురాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కూడలి నుంచి సుదిమళ్ల రైతు వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరవుతున్నారని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని చెప్పారు.

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీలో భాగంగా రూ.లక్ష మాఫీ చేసినందుకుగాను నేడు గురువారం మండల పరిధి జగన్నాథపురంలోని రైతు వేదికలో రుణమాఫీ అయిన రైతులతో సంబురాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రారంభమవుతుందని, రుణమాఫీ అయిన రైతులు హాజరు కావాలని కోరారు.

‘కాలపరిమితిపై తప్పుదారి పట్టిస్తున్న ఏఐటీయూసీ’

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం కాలపరిమితిపై ఏఐటీయూసీ తప్పుదారి పట్టిస్తున్న విషయాన్ని కార్మికులు గమనించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. కాలపరిమితిపై ఎన్నికలకు ముందే అభిప్రాయ సేకరణ చేపట్టగా ఐదు సంఘాలు నాలుగేళ్లు కావాలని, 11 సంఘాలు రెండేళ్లు సరిపోతుందని తెలిపాయని పేర్కొన్నారు. ఇదే నిర్ణయంతో ఎన్నికలు నిర్వహించగా, ఇప్పుడు నాలుగేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు కోరడం సరికాదన్నారు. అంతేకాక గుర్తింపు పత్రం ఇవ్వకుండానే అధికారిక కార్యక్రమాల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా వ్యవహరిస్తుండడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇకనైనా ఎన్నికల జరిగిన నాటి నుంచి లెక్కిస్తూ రెండేళ్లకు గుర్తింపు పత్రం జారీ చేయాలని నర్సింహారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి



కొత్తగూడెంటౌన్: విద్యానగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు

పాల్వంచ: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం నవభారత్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఎన్.శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

జూలూరుపాడు: మండలంలోని ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలి ఏకాదశి పండుగను పురాణకాలం నుంచి రైతులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పేలాల పిండిని దేవుడికి నైవేద్యంగా సమర్పించారు.

కొత్తగూడెంటౌన్: అషాఢమాసంతో తెలుగువారి తొలి పండుగ తొలి ఏకాదాశి పండుగను బుధవారం ఆలయాల్లో, ఇళ్లల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఆలయాలకు భక్తులు తరలిరావడంతో కోలాహలంగా మారింది.

టేకులపల్లి: మండలంలోని ఆలయాల్లో బుధవారం తొలిఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో స్వామి వారికి విశేష అలంకరణ, ప్రభాత సేవ, సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు.



టేకులపల్లి రామాలయంలో...



పాల్వంచ: వేంకటేశ్వర స్వామి ఆలయంలో...



జూలూరుపాడు సీతారామాలయంలో...